

# రాబడి

## ఈటీఎఫ్‌లంటే ఏంటో తెలుసా?

- ఈటీఎఫ్‌లు ఈక్విటీ, డెట్, కమోడిటీస్ వంటి వివిధ రకాల సాధనాల కోసం అందుబాటులో ఉంటాయి.
- సాధారణంగా వీటికయ్యే వ్యయభారం తక్కువే. అయితే ఈటీఎఫ్‌ల క్రయవిక్రయాల్లో బ్రోకరేజీ ఫీజులు, ఇతరత్రా ట్రేడింగ్ ఖర్చులు తప్పవు.
- ట్రేడింగ్ జరిగే రోజున ఈటీఎఫ్‌లను నాటి మార్కెట్ ధరల వద్దే కొనవచ్చు.. అమ్మవచ్చు.
- ఒక సూచీ ప్రదర్శనను ప్రతిబింబించడమే ఈ ఈటీఎఫ్‌ల లక్ష్యం.
- మ్యూచువల్ ఫండ్స్‌తో పోల్చితే దేశంలో అందుబాటులో ఉన్న ఈటీఎఫ్‌లు పరిమితం.
- ఆన్‌లైన్ బ్రోకర్లు, సంప్రదాయ బ్రోకర్-డీలర్ల ద్వారా ట్రేడ్ అవుతాయి.
- ఇండివీడ్యువల్స్ తమ రిటైర్మెంట్ ఖాతాల్లోనూ వీటిని కొనవచ్చు.





## లాభాల స్వీకరణకు అవకాశం!

**దేశీయ** స్టాక్ మార్కెట్లు వరుస లాభాల్లో దూసుకుపోతున్నాయి. మదుపరులు కొనుగోళ్ల జోష్‌లో ఉన్నారు. ఫలితంగానే గత వారం సూచీలు ఆల్‌టైమ్ హైల్లో స్థిరపడ్డాయి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,279.56 పాయింట్లు లేదా 1.57 శాతం ఎగబాకి మునుపెన్నడూ లేనివిధంగా 82,365.77 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 412.75 పాయింట్లు లేదా 1.66 శాతం ఎగిసి తొలిసారి 25,235.90 దగ్గర ముగిసింది. కాగా, మార్కెట్లు నూతన గరిష్ఠాల వద్ద ఉండటంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణ దిశగా అడుగులు వేసే వీలుందని మెజారిటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఈ వారం కరెక్షన్‌కు అవకాశాలు లేకపోలేదని అంటున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. కాగా, అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,850 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,600 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,500-25,700 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

**చివరగా..**

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.



# ఇలా.. ప్లాన్ చేసుకోండి

## సీనియర్ సిటిజన్ల పెట్టుబడికున్న 10 అత్యుత్తమ మార్గాలివే

ఆర్థిక ప్రణాళికలో పొదుపు, పెట్టుబడులకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. అవగాహన, వివేకంతో ముందుకెళ్తే ఆకర్షణీయ స్థాయిలో రాబడులను పొందవచ్చు. ఇక సాధారణ సిటిజన్స్‌తో చూస్తే సీనియర్ సిటిజన్ల పెట్టుబడులకున్న 10 అత్యుత్తమ మార్గాలను ఒక్కసారి పరిశీలిస్తే వాటిలో..

1

### • సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీం

**పదవీ విరమణ** పొందినవారు ఎక్కువగా ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల గురించే ఆరా తీస్తూ ఉంటారు. సురక్షిత, స్థిరమైన ఆదాయ వనరును కోరుకుంటారు. అలాంటి వాటిలో సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీం (ఎస్‌సీఎస్ఎస్) ఒకటి. ఇదో కేంద్ర ప్రభుత్వ పథకం. పూర్తిగా రిస్క్ లేని రుణ సాధనం. 60 ఏండ్లు, ఆపై వయసువారి కోసమే తెచ్చారు. ప్రస్తుత వడ్డీరేటు 8.20 శాతం. ప్రతీ 3 నెలలకోసారి సవరిస్తారు. కనీస పెట్టుబడి రూ.1,000, గరిష్ఠం రూ.30 లక్షలు. ఈ స్కీం గరిష్ఠ పరిమితి 5 ఏండ్లు. ఈ పెట్టుబడి మొత్తాలు పన్ను పరిధిలోకి రావు. అయితే వీటిపై పొందే వడ్డీ ఆదాయం వారివారి ఐటీ స్లాబుల ప్రకారం చెల్లించాల్సి ఉంటుంది.

2

### • పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీం

**తపాలా శాఖ** అందించే ఈ స్కీంలో పెట్టుబడులకుగాను నెలనెలా నిర్ణీత స్థాయిలో వడ్డీ ఆదాయాన్ని పొందవచ్చు. రిటైర్మెంట్ వయసులో ఆర్థిక భద్రతకు చక్కని అవకాశం. అయితే సీనియర్ సిటిజన్లకే కాదు.. 10 ఏండ్లు దాటిన భారతీయ పౌరులెవరైనా ఇందులో పెట్టుబడులకు దిగవచ్చు. దీని వార్షిక వడ్డీరేటు 7.40 శాతంగా ఉన్నది. ప్రతీ 3 నెలలకోసారి మారడానికి ఆస్కారం ఉన్నది. కనీస పెట్టుబడి రూ.1,500. గరిష్ఠ పెట్టుబడి రూ.4.5 లక్షలు. జాయింట్ అకౌంట్‌లో రూ.9 లక్షలదాకా పెట్టుబడులు పెట్టవచ్చు. కాలపరిమితి 5 ఏండ్లు. ఆ తర్వాత మరో 5 ఏండ్లు కూడా పొడిగించుకోవచ్చు. వడ్డీ ఆదాయంపై పన్నులుంటాయి.

3




### • ఫిక్స్‌డ్ డిపాజిట్లు

రెగ్యులర్ ఫిక్స్‌డ్ డిపాజిట్లే (ఎఫ్‌డీ) ఇవి. బ్యాంకుల్లో సాధారణ పౌరులతో పోల్చితే సీనియర్ సిటిజన్లకు ఆయా కాలపరిమితుల ఎఫ్‌డీలపై వడ్డీరేట్లు ఎక్కువగా లభిస్తాయి. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద ఎఫ్‌డీలలో పెట్టుబడులకు పన్ను మినహాయింపున్నది. ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను ఆదా చేసుకోవచ్చు. అలాగే నెలవారీగా, 3 నెలలవారీగా, వార్షిక ప్రాతిపదికన నగదునూ పొందవచ్చు. మార్కెట్ రిస్క్‌లకు దూరంగా ఉంటూ సురక్షితమైన పెట్టుబడులను, స్థిరమైన ఆదాయాన్ని ఆశించేవారు ఈ ఎఫ్‌డీలను పరిశీలించవచ్చు.

4



### • సిస్టమ్యాటిక్ డిపాజిట్ ప్లాన్

సిస్టమ్యాటిక్ డిపాజిట్ ప్లాన్‌లో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్), ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) ఫీచర్లుంటాయి. ఒకేసారి పెద్ద మొత్తాల్లో డిపాజిట్లకు బదులు చిన్నచిన్న మొత్తాల్లోనూ డిపాజిట్లకు ఇందులో వీలుంటుంది. నెలనెలా మనం చేసే ప్రతీ డిపాజిట్‌ను ఓ ఎఫ్‌డీగానే చూస్తారు. తక్కువలో తక్కువగా రూ.5వేలతో ఈ మంత్లీ డిపాజిట్లను ప్రారంభించవచ్చు. ఇక ఇందులో రెండు వేరియంట్లుంటాయి. ఒకటి సింగిల్ మెచ్యూరిటీ స్కీం, మరొకటి మంత్లీ మెచ్యూరిటీ స్కీం. వార్షిక వడ్డీరేట్లు 8.50 శాతందాకా ఉన్నాయి. ఏడాది నుంచి ఐదేండ్ల కాలపరిమితితో పెట్టుబడులు పెట్టవచ్చు.

5




### • నేషనల్ పెన్షన్ సిస్టమ్

నేషనల్ పెన్షన్ సిస్టమ్ అనేది కేంద్ర ప్రభుత్వం అందించే రిటైర్మెంట్ సేవింగ్స్ స్కీం. పదవీ విరమణ కాలంలో స్థిరమైన ఆదాయ వనరుగా ఉంటుంది. సంఘటిత, అసంఘటిత రంగాల్లోని ఉద్యోగులకు ఇది చక్కని పథకమనే చెప్పవచ్చు. ఉద్యోగుల నుంచి, వారి సంస్థల తరపు నుంచి ఇందులోకి నగదు జమవుతుంది. ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ, సెక్షన్ 80సీసీడీ(1బీ) కింద పన్ను ప్రయోజనాలు దక్కుతాయి.

6

### • సీనియర్ సిటిజన్ ఎఫ్‌డీ స్కీం

**60 ఏండ్లు,** ఆపై వయసున్నవారికి రెగ్యులర్ ఇన్‌కమ్‌ను అందించడానికి వచ్చినదే ఈ సీనియర్ సిటిజన్ ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) స్కీం. బ్యాంకులను బట్టి డిపాజిట్లకున్న కనీస, గరిష్ఠ పరిమితులు ఆధారపడి ఉంటాయి. కాలపరిమితి 7 రోజుల నుంచి 10 ఏండ్లదాకా ఉంటుంది. వార్షిక వడ్డీ రేట్లు 9.75 శాతం వరకున్నాయి. అత్యవసర పరిస్థితిలో ఎఫ్‌డీని వెనక్కి తీసుకోవచ్చు. అయితే జరిమానాలను చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఎఫ్‌డీల తనఖాపై రుణాలనూ పొందవచ్చు. మీ డిపాజిట్లపై రుణ మొత్తాలు ఆధారపడి ఉంటాయి. రూ.50వేల దాకా పన్ను మినహాయింపుంటుంది.



7



### • ట్యాక్స్ ఫ్రీ బాండ్లు

ట్యాక్స్ ఫ్రీ బాండ్లలో పెట్టుబడి పెట్టేవారికి చెల్లించే వడ్డీకి పన్ను మినహాయింపు ఉంటుంది. ప్రభుత్వ రంగ కార్యక్రమాలు, ప్రభుత్వ సంస్థలు, మున్సిపల్ కార్పొరేషన్లు, ఇతర మౌలిక సదుపాయాల సంస్థలు ఈ బాండ్లను ప్రభుత్వం తరపున జారీ చేస్తాయి. కాబట్టి ఇదో భద్రత కలిగిన పెట్టుబడి సాధనం.

8




### • ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం

ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం (ఈఎల్ఎస్ఎస్) అనేది ఓ ట్యాక్స్-సేవింగ్ మ్యూచువల్ ఫండ్ స్కీం. స్టాక్ మార్కెట్లు లేదా వాటి సంబంధిత సాధనాల్లో పెట్టుబడులను పెట్టడం జరుగుతుంది. అయితే ఇందులో రిస్క్ ఉంటుందన్న విషయం మరువద్దు. అయినప్పటికీ వేచిచూస్తే పెట్టుబడులపై మంచి ఆదాయాన్ని సొంతం చేసుకోవచ్చు. తక్కువ రిస్కుతో ఎక్కువ రాబడులను అందుకోవచ్చు మరి. ఇక ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ కింద ఏటా రూ.1.5 లక్షల దాకా పన్ను ఆదా చేసుకోవచ్చు. అయితే వీటిల్లో లాకిన్ పీరియడ్స్ ఉంటాయి.




9

### • మ్యూచువల్ ఫండ్స్

మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టుబడులు మార్కెట్ రిస్క్‌లకు లోబడి ఉంటాయి. పెట్టుబడులు పెట్టే ముందే సంబంధిత డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం మంచిది. నిజానికి రిస్క్‌లకు దూరంగా ఉండాలనుకునే మదుపరులకు ఇవి పనికిరావు. ఈక్విటీ, రుణ మార్కెట్లలో మీ సొమ్మును మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్ట్ చేయడమే ఇందుకు కారణం. అయితే ధైర్యంతో నిర్ణయాలు తీసుకుంటే దీర్ఘకాలంలో ఆకర్షణీయ రాబడులనే అందిస్తాయని చెప్పవచ్చు. కాబట్టి నిపుణుల సలహా మేరకు మీ ఇన్వెస్ట్‌మెంట్ పోర్ట్‌ఫోలియోలో మ్యూచువల్ ఫండ్స్‌కూ కొంత భాగం ఇవ్వవచ్చు. లాభాలపై మూలధన లాభాల పన్నులుంటాయి.

10

### • పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్

సీనియర్ సిటిజన్లకు పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) కూడా ఆకర్షణీయమైన పెట్టుబడి సాధనాల్లో ఒకటి. ఇదో సురక్షిత పెట్టుబడి మార్గం. పీపీఎఫ్‌లో పెట్టుబడి ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను ఆదాకు అవకాశాన్నిస్తుంది. పీపీఎఫ్ ఖాతా పరిమితి 15 ఏండ్లు.



అంబేద్కర్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు

## పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 1: ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని టీజీఈ జేఏసీ చైర్మన్ బూరుగు రవి డిమాండ్ చేశారు. ఆదివారం టీజీఈ జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ 1 సెప్టెంబర్ 2004 నుంచి అమలు చేస్తున్న సీపీఎస్‌ను రద్దు చేయాలని, గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో సీపీఎస్‌ను రద్దు చేస్తామని చెప్పిన విధంగా వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీజీఈ జేఏసీ వైస్ చైర్మన్ రేగూరి సుభాకర్‌రెడ్డి, కేంద్ర సంఘం పరిశీలకుడు టీఎన్‌జీవో కేంద్ర ఉపాధ్యక్షుడు ఎం హరికృష్ణ, కార్యదర్శి ఠాకూర్ జ్ఞానేశ్వర్ సింగ్, టీఎన్‌జీవోస్ జిల్లా కార్యదర్శి దశరథ రామారావు, సునీల్‌కుమార్, పీఆర్‌టీయూ టీఎస్ ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్, రాష్ట్ర బాధ్యులు మందల రవీందర్‌రెడ్డి, కృష్ణమోహన్, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి రమేశ్, ఎస్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేశ్‌నాయక్, గణేశ్, పీఆర్‌టీయూ తెలంగాణ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాచర్ల శ్రీను, శంకర్, టీపీటీఎఫ్ బాధ్యులు సేవ నాయక్, టీఎస్‌సీపీఎస్ ఈయూ జిల్లా అధ్యక్షుడు దిల్ షాన్, ప్రధాన కార్యదర్శి భార్గవ్, డీటీఎఫ్ బాధ్యులు రమణారెడ్డి, తిరుపతి, పెన్షనర్స్ సంఘ బాధ్యులు రామచంద్రమూర్తి, ఐలయ్య, గాదం పోచయ్య, విక్రమ్ సింగ్, ధన్సింగ్, టీటీయూ రఘు వీర్ నాయక్, సరోజన, టీఎన్‌జీవోఎస్ జిల్లా ఉపాధ్యక్షులు టీ సత్యనారాయణ, రాజ్‌కుమార్, హరి ప్రసాద్, నాగరాజు, కుమారస్వామి, రామయ్య, కన్నయ్య, స్వామి, కిశోర్, సంతోష్, శ్రీకాంత్, రమణకుమార్, సాంబశివరావు, లింగయ్య పాల్గొన్నారు.

## చేప ఉత్పత్తులపై మహిళా సంఘాలకు శిక్షణ

గణపురం, సెప్టెంబర్ 1: మండలంలోని గాంధీనగర్‌లో జలజీవిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎస్‌వీపీ ఇండియా, మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మహిళా సంఘాలకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లా మత్స్య శాఖ అధికారి అవినాశ్ ఆధ్వర్యంలో చేప నిల్వ పచ్చడి, చేప అప్పడాలు, చేప మురుకులు (చెకోడిలు), చేప పకోడి, రొయ్యల పొట్టు, రొయ్యల కారా, ఆక్వేరియం తయారీ విధానాన్ని నేర్పించారు. జల జీవికా సంస్థ సభ్యులు రేమా తవాడే, సతీశ్ గంటా, యాదులపూర్ నందకిశోర్, బూర కరుణ శిక్షణా ఇచ్చారు. కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు బొల్ల రమ, కార్యదర్శి పల్లెబోయిన లావణ్య పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న మహిళా సంఘాల సభ్యులు

## గోదావరి తీరం షాపులను బంద్ చేసిన ఎస్సై

కాళేశ్వరం, సెప్టెంబర్1 : కాళేశ్వరం వద్ద గోదావరి ఒడ్డున ఉన్న దుకాణాలను ఆదివారం ఎస్సై చక్రపాణి బంద్ చేయించారు. నదీ ప్రవాహం పెరుగుతున్నందున బంద్ చేయించినట్లు తెలిపారు. పుష్కరఘాట్, పూస్కుపల్లి వారికోసం ఆలయం ఆవరణలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎస్సై చెప్పారు.

# భూపాలపల్లి జిల్లాకు రెండు రోజులు రెడ్ అలెర్ట్

### కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 1 : రానున్న రెండు రోజులు జిల్లాకు రెడ్ అలెర్ట్ ఉన్నదని, ప్రభుత్వ యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. వర్షాలు, వరదలపై ఆదివారం అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. గడిచిన రెండు రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టామని, రానున్న రెండు రోజులూ ఇదే స్ఫూర్తితో అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల స్థాయిలో రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ అధికారులు పరిస్థితులను పర్యవేక్షణ చేయాలన్నారు. వర్షం ఎప్పుడు వస్తుందో తెలియనందున ప్రజలు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. వాగులు, రహదారులపై నీరు చేరితే ప్రమాద హెచ్చరికలు బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో పటిష్ట రక్షణ చర్యలు చేపట్టాలని, ముందస్తు చర్యల్లో భాగంగా ముంపు గ్రామాల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. నిత్యావసరాలు అందుబాటులో ఉంచుకోవాలని, విద్యుత్ ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా లూజు వైర్లను గుర్తించి ఎలాంటి ప్రమాదాలు వాటిల్లకుండా తగు రక్షణ చర్యలు చేపట్టాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. జలాశయాలకు చూసేందుకు ప్రజలు వస్తుంటారని, వారు రాకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. తహసీల్ కార్యాలయాలతో పాటు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అత్యవసర సేవలకు 9030632608, 18002451123 నంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు. ప్రసవానికి దగ్గర తేదీ ఉన్న మహిళలను దవాఖానలకు తరలించాలని వైద్యాధికారులను ఆదేశించారు. 102, 104 వాహనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. కాళేశ్వరానికి వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున రెవెన్యూ, పోలీస్, పంచాయతీ, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ



గణపురం : మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

## మృతుల కుటుంబాలకు గండ్ర పరామర్శ

కృష్ణకాలనీ/ గణపురం, సెప్టెంబర్ 1 : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధి, గణపురం మండలంలో పలువురు మృతుల కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆదివారం పరామర్శించారు. ఖాసింపల్లికి చెందిన పులి శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకోగా వంద పడకల దవాఖానలో మృతదేహాన్ని పరిశీలించి నివాళులర్పించారు. అలాగే బీఆర్ఎస్ భూపాలపల్లి అర్బన్ యూత్ ఉపాధ్యక్షుడు సిద్ధం రాకేశ్‌పటేల్ అనారోగ్యంతో మృతి చెందిగా ఆయన ఇంటికి వెళ్లి మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కౌన్సిలర్లు కొత్త హరిబాబు, మంగళపల్లి తిరుపతి, టీబీజీకేఎస్ భూపాలపల్లి ఏరియా బ్రాంచ్ కమిటీ ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య, బీఆర్ఎస్ నాయకులు బండారు రవి, మేనం రాజేందర్, పులి రవి, యూత్ నాయకులు పొలవేని అశోక్, యుగేంద్రాచారి, రాజ్ కుమార్, కాత్మండి సతీశ్‌కుమార్, మైఖెల్ శ్రీనివాస్ పాల్గొన్నారు. గణపురం మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ మండల యూత్ నాయకుడు గాజర్ల రాజు (చింటూ) తండ్రి రఘుపతి గౌడ్ ఇటీవల మృతిచెందగా గండ్ర కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోతె కర్ణాకర్‌రెడ్డి, భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోలుసాని లక్ష్మీ నరసింహారావు, మాజీ సొసైటీ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ తోట మానసా శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మంద అశోక్‌రెడ్డి, నాయకులు బైరగాని కుమారస్వామి గౌడ్, పేరాల దేవేందర్‌రావు, ఉడుత సాంబయ్య యాదవ్, ఇడబోయిన సంతోష్ యాదవ్, పల్లెబోయిన సదయ్య, దోమల రవీందర్, శ్రీకాంత్, ఎడ్ల యాకేశ్ పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలి

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 1 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పట్టణంలో పచ్చదనాన్ని పెంపొందించాలని 17వ వార్డు కౌన్సిలర్ ముంజంపెల్లి మురళీధర్ అన్నారు. ఆదివారం సుభాష్ కాలనీ ప్రజలకు కౌన్సిలర్ పూల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు లేకపోతే మానవాళికి మనుగడ లేదని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ సామంతుల నిర్మల, లత, రాజేశ్వరి, పెద్ద మనుషులు మచ్చ భద్రయ్య, చుక్క బాలరాజు గౌడ్, దాసరి బ్రహ్మారెడ్డి , అనసూరి గణేశ్, వంగల మోహన్, తేలి సురేందర్, గాజ రాములు, గుర్రాల రామస్వామి, భూక్యా శ్రీరామ్, తుమ్మల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ మురళీధర్

## సీసీ కెమెరాలతో నేరాలు తగ్గించొచ్చు

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 1 : సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల శాతాన్ని తగ్గించవచ్చని సీఐ నరేశ్‌కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని హైటెక్ కాలనీ, జీఎంఆర్ కాలనీ ప్రజలతో ఆయన సమావేశమై సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరించారు. ఇటీవలి కాలంలో హైటెక్ కాలనీలో జరిగిన దొంగతనం కేసులో సీసీ కెమెరాల సహాయంతో నిందితులను పట్టుకున్నట్లు చెప్పారు. ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని పోలీసులకు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



సంతకాలు సేకరిస్తున్న కాలనీ ప్రజలు

## సెల్ టవర్‌ను వెంటనే తొలగించాలి

కృష్ణకాలనీ, సెప్టెంబర్ 1 : మున్సిపల్ 25వ వార్డు కారల్ మార్క్స్ కాలనీలో ఏర్పాటు చేసిన సెల్ టవర్ ను వెంటనే తొలగించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు క్యాతరాజు సతీశ్‌కుమార్ అధికారులను డిమాండ్ చేశారు. సెల్ టవర్‌తో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని నిరసిస్తూ ఆదివారం వారు కాలనీ వాసులతో కలిసి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు వేముల శ్రీకాంత్, కాలనీవాసులు రాజేశ్, మహేశ్, రమేశ్, రాంబాబు, సంతోష్, సీపీఐ నాయకులు యాకూబ్ పాషా, తిరుపతి, కృష్ణ, రజిత, సంధ్య, చందన, లావణ్య, వనిత, స్వరూప పాల్గొన్నారు.

## విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలి

కృష్ణకాలనీ : వర్షాకాలంలో ప్రజలు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని భూపాలపల్లి టౌన్ ఏఈ విశ్వాస్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తడిసిన కరెంట్ స్తంభాలను ముట్టుకోవద్దని, స్టార్టర్లు, మోటర్లు, విద్యుత్ లైన్‌కు తగులుతున్న చెట్లను ముట్టుకోవద్దని పేర్కొన్నారు. ఉతికిన బట్టలు ఇనుప తీగలపై వేయొద్దని సూచించారు. కరెంటు లైన్ కింద సెల్ ఫోన్ మాట్లాడొద్దన్నారు.ఇంట్లోకి వచ్చే సర్వీస్ వైర్ డ్యామేజ్ అయితే జేఎల్ఎం, ఏఎల్ఎం లేదా ఏఈ దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు.

## 13న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ క్రీడా ఎంపికలు

కృష్ణకాలనీ, సెప్టెంబర్ 1 : అంబేద్కర్ క్రీడా మైదానంలో ఈనెల 13న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ క్రీడా ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూతల సమ్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 4న జరుగాల్సిన క్రీడలు వర్షాల నేపథ్యంలో 13వ తేదీకి వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 13న ఉదయం 8 గంటల లోపు జనన ధ్రువీకరణ పత్రంతో అంబేద్కర్ క్రీడామైదానానికి రావాలని సూచించారు.

## భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

గణపురం/ చిట్యాల, సెప్టెంబర్ 1 : జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్లు ఎం సత్యనారాయణస్వామి, హేమ అన్నారు. శిథిలమైన పాత ఇళ్లలో ఉండొద్దని, చెరువులు, కాలువల ప్రవాహాల వద్దకు ఎవరూ వెళ్లొద్దని సూచించారు. పిడుగులు పడే అవకాశం ఉన్నందున చెట్ల కింద ఉండొద్దన్నారు. అత్యవసర పరిస్థితి ఎదురైతే కలెక్టరేట్ కంట్రోల్ రూం టోల్‌ఫ్రీ నంబర్ 1800 4251123, గణపురం తహసీల్ 98490 81855 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

కృష్ణకాలనీ, సెప్టెంబర్ 1 : సెప్టెంబర్ 1న దేశవ్యాప్తంగా అంతర్జాతీయ యాక్షన్ డే నిర్వహించాలని కేంద్ర కార్మిక సంఘాల నిర్ణయం మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ అనుబంధ సంఘం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బందు సాయిలు మాట్లాడారు. 1946 నుండి పాలస్తీనియన్ల భూభాగాలను బ్రిటన్, అమెరికన్ సైన్యాలు ఆక్రమించుకొని బ్రిటన్, రష్యా, అమెరికా తదితర దేశాల్లోని యూదుల్ని పాలస్తీనా భూ భాగంలో చొప్పించడంతో మొదలైన ఘర్షణలు గత 80 ఏండ్లుగా అనేక రూపాల్లో యుద్ధం కొనసాగుతోందన్నారు. దీనిని వ్యతిరేకించాలని కార్మిక సంఘాలు, కార్మిక వర్గం, ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, నరేశ్, సారయ్య, వసంత లక్ష్మి, జ్ఞానేశ్వరి, సుశీల, నర్సమ్మ, దుర్గం రాజు పాల్గొన్నారు.